# కనువిప్పు

ఆంధ్రభూమి వీక్లీ.. 20 మార్చి, 2003



"వదినా! మా అమ్మలాంటి అత్తగారు దొరకడం మీ అదృష్టం!" సాహితితో అంది ఆమె ఆడపడుచు ఇందిర.

"నిజం ఇందిరా! మీ అమ్మగారు చాలా మంచివారని పెళ్ళికి ముందే చాలామంది చెప్పారు. ఇప్పుడు ఆమె మంచితనం, ప్రేమ చూస్తుంటే నేనెంతో అదృష్టవంతురాల్ని అనిపిస్తోంది!" అంది సాహితి ఆనందంగా.

సాహితికి ఆనంద్‌తో పెళ్ళయి అప్పటికి ఆరు రోజులయింది. పెళ్ళికాగానే సాహితి తల్లిదండ్రులు ఆమెను అత్తగారింట్లో దిగబెట్టి రెండురోజులుండి వెళ్ళిపోయారు. హైదరాబాదులో

పుట్టి, పెరిగి- తిరుపతిలోని అత్తవారింట్లో అడుగుపెట్టిన సాహితికి మొదట్లో భయంగా అన్పించింది. అయితే భర్త ప్రేమ, అత్తగారు, ఆడపడుచుల ఆదరణతో భయం దూరమైంది. వాళ్ళకున్న మంచిపేరు నిలబెట్టే బాధ్యత తనమీద కూడా ఉందని అర్థంచేసుకుని అందరితో మంచిగా మాట్లాడుతూ, అందర్నీ కలుపుకుంటూ, ఎక్కడా నోరుజారకుండా తక్కువకాలంలోనే అందరి మన్ననల్ని పొందింది.

కొద్ది సంవత్సరాల్లో మరదులిద్దరికీ పెళ్ళిళ్లయి, తను పెద్ద కోడలుగా మారింది. తోడికోడళ్ళతో స్నేహంగా ఉంటూ వాళ్ళేమైనా అన్నా- సంయమనంతో ప్రవర్తించి సర్దుకుపోసాగింది. కొద్దిరోజులకు ఇందిరకు కూడా పెళ్ళి నిశ్చయమైంది. చెల్లెలి పెళ్ళి ఘనంగా చేశారు అన్నదమ్ములు.

పెళ్ళయ్యాక తొలిసారిగా పుట్టింటికొచ్చిన ఇందిరతో-

"మీ అత్తగారు నిన్ను బాగా చూసుకుంటున్నారా?" అని అడిగింది సాహితి.

"ఫర్వాలేదు. అయినా... మీ అత్తగారంత మంచివారు కారులెండి! మేము ఏం చేసినా, ఎక్కడికి వెళ్లినా ఆవిడకు చెప్పాలంటారు. 'చిన్నవాళ్ళు... ఎంజాయ్ చెయ్యనీ!' అని వదిలెయ్యరు."

"అంతేకదా... నువ్వే కాస్త సర్దుకుపోతే సమస్యలు ఉండవు."

"సర్దుకునే పోతున్నాను. అయితే ఒక్కోసారి నా ఓపికను పరీక్ష చేస్తుంది!" అంది ఇందిర.

ఆ తర్వాత కొద్దిరోజులకు ఇందిర- భర్తతో 'వేరు కాపురం' పెట్టినట్లు తెలిసి, సాహితి చాలా బాధపడింది. విషయమేమిటో తెలుసుకుని రమ్మని భర్త ఆమెని నెల్లూరుకి పంపాడు.

వదినను చూడగానే కళ్ళనీళ్లు పెట్టుకుంది ఇందిర.

"ఏమైంది ఇందూ... ఏం జరిగింది?" కంగారుగా అడిగింది సాహితి.

"ఆవిడతో నాకు సరిపళ్లేదు వదినా! ఇక అక్కడుంటే నాకు మనశ్శాంతి ఉండదని, ఇక్కడికి వచ్చేశాం!" అంది.

"పోనీలే... జరిగినదంతా మన మంచికే అనుకో! ఇక వేరే ఆలోచనలేవీ పెట్టుకోకుండా హాయిగా ఉండు!" అంది సాహితి. వెళ్లగానే- 'నువ్వు చేసింది బాగాలేదు!' అంటే- మరింత బాధపడుతుందనే ఉద్దేశంతో!

ఆరోజు సాయంత్రం ఇందిర అత్తగార్ని చూడటానికి వెళ్లింది.

ఆవిడ సాహితిని చూడగానే ఆనందంగా ఎదురొచ్చి చేయి పట్టుకొని, "బాగున్నావామ్మా..?" అంది ఆప్యాయంగా.

తర్వాత ఇందిర గురించి చెప్పసాగింది. ఎందుకో... ఇందిరకు తనంటే మొదటినుంచీ ఇష్టం లేదనీ, ప్రతి విషయానికీ విసుక్కుంటుందనీ, తనపై కోపం భర్తపై చూపిస్తుందనీ, అందుకే 'వాళ్ళు సుఖంగా ఉంటే చాలు!' అని, తనే 'వేరు కాపురం' పెట్టమని సలహా ఇచ్చాననీ చెప్పింది.

సాహితికి ఆశ్చర్యం వేసింది. ఇందిర 'తప్పంతా అత్తగారిదే!' అంది. మరి, ఈవిడ వెర్షన్ ఇంకోవిధంగా ఉంది.

"నేను కొడుకూ, కోడలితో ఆనందంగా గడపాలని ఆశించాను. నాకా అదృష్టం లేదు. నువ్వూ, మీ అత్తగారు ఎంత అన్యోన్యంగా ఉంటారు? మిమ్మల్ని చూసైనా ఇందిరకి బుద్ధిరాలేదు!" అంది ఆవిడ.

వద్దంటున్నా వినకుండా కాఫీ కలిపి ఇచ్చింది.

సాహితికి ఇల్లంతా బోసిగా ఉన్నట్లు అన్పించింది.

ఆమె రెండోకొడుకు ఇంట్లో లేనట్లుంది. ఆమె భర్తపోయి అయిదేళ్లయింది.

"మరి, నేను వస్తాను. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి!" అంది సాహితి సెలవు తీసుకుంటూ.

"నాకేం అయితే ఏంలే అమ్మా..! కన్నకొడుకుతో కలిసి ఉండలేని జన్మ ఎందుకు? నేను ఉన్నా ఒకటే, లేకున్నా ఒక్కటే!" అంటూ భోరున ఏడ్చేసింది.

ఆవిడని అలా చూస్తున్న సాహితి మనసు తరుక్కుపోయింది.

"ఊరుకోండి! మీరు మాకు కావాలి. ఇందిర చిన్నపిల్ల... నేను నచ్చచెబుతాను. మీరు ధైర్యంగా ఉండండి!" అనిచెప్పి బయలుదేరింది సాహితి.

"ఏమన్నారు మా అత్తగారు?" ఇంటికి రాగానే కుతూహలంగా అడిగింది ఇందిర.

"మీరు ఇల్లు వదిలి వెళ్లిపోయినందుకు చాలా బాధపడింది. ఏడ్చేసింది కూడా! నాకు చాలా జాలి వేసింది!" అంది సాహితి.

"ఇప్పుడేడ్చి ఏం లాభం? ఆ తెలివి ముందే ఉండాలి!"

"పోనీ... కొద్దిరోజులాగి ఆవిడ్నీ, మీ మరిదినీ ఇక్కడికే వచ్చేయమని చెప్పు. ఈ కొద్దిరోజుల్లో ఆమెలో పరివర్తన రావొచ్చు. నీకూ ఇన్నాళ్లు ప్రాబ్లెమ్స్ అనిపించినవి- అసలు అవి ప్రాబ్లెమ్స్ కావని తోచవచ్చు!" అంది.

"వద్దు వదినా! ఒకసారి విడిగా వచ్చాక మళ్లీ కలవడం అసంభవం!"

ఆమె అంత ఖచ్చితంగా చెప్పడం చూసి, ఇక తను నచ్చచెప్పినా ఫలితం ఉండదనీ, కాలమే ఆమెలో మార్పు తీసుకురావాలనీ భావించి ఊరుకుంది సాహితి.

ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన ఇందిర భర్త సురేష్- సాహితిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత ఆనందించాడు.

"మా క్రొత్త సంసారంలో మొట్టమొదటి గెస్ట్ మీరే..!" అన్నాడు.

రాత్రి భోజనాలప్పుడు తన తల్లి ఆరోగ్యం గురించి విచారించింది ఇందిర.

"వదినా..! నేను ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను... 'మీరెంత అదృష్టవంతులో!' అని! మా అమ్మలాంటి అత్తగారు అందరికీ దొరకరు."

'అవు'నన్నట్టు తలాడించింది సాహితి.

"మీరంటే అమ్మకు చాలా ఇష్టం! ఎంత బాగా చూసుకుంది మిమ్మల్ని? నాకు అంత అదృష్టం రాసి పెట్టలేదు ఆ భగవంతుడు!"

వింటున్నకొద్దీ సాహితిలో అసహనం కలగసాగింది. ఇక ఉపేక్షిస్తే లాభంలేదని, ఇదే మంచి అవకాశమని భావించి-

"చూడు ఇందిరా..! మీ అమ్మగారు చాలా మంచివారని, ఆమెను అత్తగా పొందిన నేను చాలా అదృష్టవంతురాలినని నాకు పెళ్ళైనరోజునుంచీ నువ్వు చెబుతూనే ఉన్నావు. నేనూ ఆ విషయం అంగీకరిస్తాను. కానీ, మామధ్య ఇంత అన్యోన్యత ఉందంటే... అది ఆవిడ ఒక్కరి ప్రయత్నం కాదని నువ్వు గ్రహించాలి. మా అమ్మానాన్నల్ని వదలి అంతదూరం వచ్చిన నేను- నా అత్తామామల్నే తల్లిదండ్రులుగా భావించాను. మీ అమ్మగారు కూడా నన్ను నొప్పించిన సందర్భాలు లేకపోలేదు. నేనూ తెలిసో, తెలియకో ఆవిడ మనసు నొప్పించే ఉంటాను. అయితే 'రెండు

చేతులూ కలిస్తేనే చప్పట్లు' అన్నవిషయం మా ఇద్దరికీ తెలుసు కనుక- మేము పట్టించుకోలేదు. మీ అమ్మగారిలో నాకు నచ్చని విషయాలు కొన్ని ఉన్నాయి. అయితే... పది క్వాలిటీస్‌లో తొమ్మిది క్వాలిటీస్ నచ్చినప్పుడు ఆ పదో క్వాలిటీ గురించి గొడవపడటం, మనుషుల్ని దూరం చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. అందుకే నేనే సర్దుకుపోయాను. మరి, అంత మంచిమనిషి రెండో కోడలికి, మూడో కోడలికి మంచి అత్తగారు ఎందుకు కాలేకపోయింది? వాళ్ళకు నాలా సర్దుకుపోవడం తెలియదు కనుక.., ఆవిడ వయసుకి మర్యాద ఇవ్వడం అలవాటు లేదు కనుక!

మీ అమ్మగారిని నేను బాగా చూసుకోవాలని ఆరాటపడ్డావేగాని- మీ అత్తగారి గురించి ఆమె కొడుకులకి కూడా అలాంటి ఆరాటమే ఉంటుందని గుర్తించలేకపోయావు. నువ్వు నీ అత్తగారితో సర్దుకుపోలేవుగానీ- మీ అమ్మగారితో మాత్రం ఆమె కోడళ్ళు సర్దుకుపోవాలి... అవునా?" అంది ఆవేశంగా.

సాహితి అంత ఆవేశంగా మాట్లాడటం ఇదివరకు చూడని ఇందిరకు భయంవేసింది.

"ఇందిరా! ఇప్పటికైనా మించిపోయింది లేదు. పెద్దదానిగా చెప్తున్నాను- నా మాట విను. మీరు వాళ్ళింటికి వెళ్తారో, లేక వాళ్ళనే ఇక్కడికి పిలిపించుకుంటారో మీరే నిర్ణయం తీసుకోండి! కానీ, మీ అత్తగార్ని మాత్రం అలా దూరంగా ఉంచకు. అసలే వయసు మళ్లినావిడ! మనస్తాపంతో ఆరోగ్యం పోగొట్టుకొని, రేపేదైనా అనుకోనిది జరిగితే జీవితమంతా బాధపడాల్సి వస్తుంది."

ఊరికి బయలుదేరిన సాహితికి చీరా, రవికా తాంబూలంలో పెట్టి ఇచ్చింది ఇందిర.

"ఇప్పుడివన్నీ ఎందుకు ఇందూ..!" అంది సాహితి ఇబ్బందిగా చూస్తూ.

"ఫర్వాలేదు వదినా..! మా కొత్తసంసారంలో మొదటి గెస్టూ మీరే, చివరి గెస్టూ మీరే! ఎందుకంటే... రేపే అమ్మావాళ్ళింటికి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాము" అంది ఇందిర.

'అత్తగారింటికి' అనకుండా- 'అమ్మగారింటికి' అని ఇందు అనడం ఆమెలో వచ్చిన మార్పుగా గ్రహించింది సాహితి.

"వెరీగుడ్! నువ్వూ మంచిదానివే ఇందూ! నీ గురించి నాకు తెలియదా..! అసహనం కాస్త ఎక్కువ నీకు! అది తగ్గించుకుంటే నువ్వూ మంచి కోడలివవుతావు. పాజిటివ్ థింకింగ్ అలవాటు చేసుకో... ఏదీ నీకు సమస్యగా అనిపించదు!" అంది సాహితి సంతోషంతో.

బస్సులో కూర్చుని, 'నా ప్రయాణం విజయవంతమైంది!' అనుకుంది సాహితి.

భర్తతో జరిగినదంతా చెప్పాక, ఆనంద్-

"మరి, మా అమ్మలో నీకు నచ్చని ఆ పదో క్వాలిటీ గురించి నాకెప్పుడూ చెప్పలేదే..?" అన్నాడు.

"ఉంటేకదా చెప్పడానికి..! ఇందిరలో మార్పు తేవడం కోసం అలా చెప్పాను. నిజానికి ఆమెలో నాకు నచ్చని విషయాలే లేవు. అందుకే మీకంటే మీ అమ్మగారే నాకు ఎక్కువ ఇష్టం!" అంది అతన్ని ఉడికిస్తూ.

"నేను కోరుకొనేదీ అదే! తల్లికీ, భార్యకీ మధ్య అండర్‌స్టాండింగ్ ఉంటే మగవాడికి యాభైశాతం సమస్యలు తీరినట్లే!" అన్నాడు ఆనంద్ ప్రేమగా సాహితిని దగ్గరగా తీసుకుంటూ!